ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G) , రిజిస్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.

Registered No : APTEL/25/A1201

# గాయత్రి వార్తలు

జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
గాయత్రి వార్తలు జాతీయ తెలుగు దినపత్రికలో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలలో పనిచేయుటకు ఆసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
యం. నాగేశ్వర రావు
ఎడిటర్ గాయత్రి వార్తలు
సెల్: 73860 45673

PUBLISHED FROM : DELHI - MAHARASHTRA - ANDHRA PRADESH - TELANGANA - KARNATAKA - TAMILANADU - GOA - LOCKNOW - EDITOR : M. NAGESWARARAO

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ సోమవారం 19-01-2026 సంపుటి : 1 సంచిక :209 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-

## కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు..

# శంకుస్థాపన చేసిన చంద్రబాబు, పవన్

**కాకినాడలో ఏర్పాటు చేయనున్న అతి పెద్ద గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత..ప్రాజెక్టు నిర్మాణానికి సుమారు రూ.18 వేల కోట్ల పెట్టుబడి**

- నిర్మాణ సమయంలో 8వేల మందికి ఉపాధి లభించనుంది
- లాజిస్టిక్స్, స్టోరేజి, పోర్టు సేవల ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు
- జర్మనీకి చెందిన యూనిపర్‌కు ఈ గ్రీన్ అమ్మోనియాను ఎగుమతి చేస్తారు
- దేశంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా కాంప్లెక్స్ అవుతుంది
- 495 ఎకరాల్లో ప్లాంట్‌ను సంస్థ ఏర్పాటుచేస్తోంది : ముఖ్యమంత్రి చంద్రబాబు





**కాకినాడ:** కాకినాడలో ఏర్పాటు చేయనున్న అతి పెద్ద గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత.. గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. గ్రీన్‌కో గ్రూప్‌నకు చెందిన ఏఎం గ్రీన్ సంస్థ ఏర్పాటుచేసే ప్రాజెక్టు ద్వారా జర్మనీ, జపాన్, సింగపూర్‌కు గ్రీన్ అమ్మోనియా ఎగుమతి చేయనుంది. ప్రాజెక్టు నిర్మాణానికి సుమారు రూ.18 వేల కోట్ల (2 బిలియన్ డాలర్ల) పెట్టుబడిని సంస్థ పెట్టనుంది. నిర్మాణ సమయంలో 8వేల మందికి ఉపాధి లభించనుంది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన తర్వాత లాజిస్టిక్స్, స్టోరేజి, పోర్టు సేవల ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు సంస్థ ప్రతిపాదనల్లో పేర్కొంది. జర్మనీకి చెందిన యూనిపర్‌కు ఈ గ్రీన్ అమ్మోనియాను ఎగుమతి చేస్తారు. మలేసియాకు చెందిన పెట్రోనాస్, సింగపూర్‌లోని జీఐసీ, యూఏఈకి చెందిన ఏడీఏఐ వంటి సంస్థల సహకారంతో ప్రాజెక్టును ఏర్పాటుచేస్తున్నారు. కాకినాడలో ఏర్పాటుచేసే గ్రీన్ అమ్మోనియా కాంప్లెక్స్ ద్వారా ఏటా 1.5 మిలియన్ టన్నుల (ఎంఎంటీపీఏ) గ్రీన్ అమ్మోనియా, 1,950 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్‌ను సంస్థ ఉత్పత్తి చేయనుంది. ఇది దేశంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా కాంప్లెక్స్ అవుతుందని ప్రభుత్వం పేర్కొంటోంది. 2028 నాటికి 0.5 ఎంఎంటీపీఏ, 2030 నాటికి మరో 1.0 ఎంఎంటీపీఏ గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి సామర్థ్యానికి చేరుకునేలా సంస్థ ప్రతిపాదనలు రూపొందించింది. 495 ఎకరాల్లో ప్లాంట్‌ను సంస్థ ఏర్పాటుచేస్తోంది.



## ఆ పెన్సిల్ గీతలు ఎంత తప్పో

# నేటితరానికి తెలియాలి

**'దేశ విభజన'పై సుధామూర్తి**

- దేశ చరిత్ర, ముఖ్యంగా దేశ విభజనకు దారితీసిన పరిస్థితులను నేటితరం పిల్లలు తప్పనిసరిగా అర్థం చేసుకోవాలి
- దేశ విభజన జరగడం తప్పని, భవిష్యత్తులో అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూసుకోవాలి
- నీకు చరిత్ర తెలియకపోతే.. భవిష్యత్తును అర్థం చేసుకోలేవు
- దేశ విభజన నాటి పరిస్థితులు గుర్తొస్తే.. ఆ పరిణామాల గురించి నేటితరానికి తెలియజేయాలి
- ఈ భూమి, మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ ఊరికే రాలేదన్న విషయాన్ని ఇప్పటి పిల్లలకు చెప్పాలనుకుంటున్నా..
- దేశ విభజన కోసం ఆనాడు తీసుకున్న ఓ తప్పుడు నిర్ణయం ఎన్నోతరాలపై ప్రభావం చూపిస్తోంది

**జైపూర్:** దేశ చరిత్ర, ముఖ్యంగా దేశ విభజనకు దారితీసిన పరిస్థితులను నేటితరం పిల్లలు తప్పనిసరిగా అర్థం చేసుకోవాలని రాజ్యసభ ఎంపీ, ప్రముఖ రచయిత్రి సుధామూర్తి అన్నారు. దేశ విభజన జరగడం తప్పని, భవిష్యత్తులో అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. రాజస్థాన్‌లో జరుగుతోన్న జైపూర్ సాహిత్య వేడుకలో సుధామూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ విభజనపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. "నీకు చరిత్ర తెలియకపోతే.. భవిష్యత్తును అర్థం చేసుకోలేవు. దేశ విభజన నాటి పరిస్థితులు గుర్తొస్తే.. ఆ పరిణామాల గురించి నేటితరానికి తెలియజేయాలని ..2వ పేజీలో

# బెంగాల్‌కు చొరబాట్లే అసలు సవాల్..!!

- అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే భాజపా ప్రభుత్వం రావాలి
- దేశ ప్రజలు ముఖ్యంగా జెన్-జీ కూడా భాజపా అభివృద్ధి నమూనాను విశ్వసిస్తున్నారు
- బిహార్‌లో ఎన్డీయే విజయం సాధించిందని, ఇక బెంగాల్‌కు సమయం ఆసన్నమైంది
- బెంగాల్‌కు అసలైన సవాల్ చొరబాట్లేనని, వీటిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం
- చొరబాట్ల ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల జనాభా వర్గీకరణలోనూ మార్పు వచ్చింది
- వీటిని అరికట్టడానికి తృణమూల్ కాంగ్రెస్ ఎటువంటి చర్యలు చేపట్టలేదు..
- రాష్ట్రానికి వరద సహాయ నిధులను 40 సార్లు అందించాం....
- కేంద్రం నిధులను తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం కొల్లగొడుతోంది
- టీఎంసీ అధికారం కోల్పోయి.. భాజపా అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి
- తూర్పు భారత్ దశాబ్దాలుగా వెనకబడి ఉంది - ప్రధాని మోదీ

ప్రజల ఆకాంక్షలను తీర్చడంలో మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం విఫలమైందని, బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ప్రధాని మోదీ అన్నారు. పశ్చిమబెంగాల్ పర్యటనలో భాగంగా ప్రధాని మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే భాజపా ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ప్రజలు ముఖ్యంగా జెన్-జీ కూడా భాజపా అభివృద్ధి నమూనాను విశ్వసిస్తున్నారని అన్నారు. మాల్దా సభలో ప్రసంగించిన ఆయన.. బిహార్‌లో ఎన్డీయే విజయం సాధించిందని, ఇక బెంగాల్‌కు సమయం ఆసన్నమైందన్నారు. ఈ సందర్భంగా బెంగాల్‌కు అసలైన సవాల్ చొరబాట్లేనని, వీటిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

**చొరబాట్లే అసలైన సవాల్..** బెంగాల్‌కు అతిపెద్ద సవాల్ చొరబాట్లేనని.. వీటి కారణంగానే మాల్దా, ముర్షీదాబాద్‌తో




పాటు ఇతర ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగుతున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. చొరబాట్ల ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల జనాభా వర్గీకరణలోనూ మార్పు వచ్చిందని, వీటిని అరికట్టడానికి తృణమూల్ కాంగ్రెస్ ఎటువంటి చర్యలు చేపట్టలేదని దుయ్యబట్టారు. రాష్ట్రానికి వరద సహాయ నిధులను 40 సార్లు అందించామని, అయినా అవి అసలైన లబ్ధిదారులకు చేరలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కేంద్రం నిధులను తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం కొల్లగొడుతోందని.. ఆ పార్టీ అవినీతి, హింస, బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడే పార్టీ అని అన్నారు. టీఎంసీ అధికారం కోల్పోయి.. భాజపా అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. తూర్పు భారత్ దశాబ్దాలుగా వెనకబడి ఉందన్నారు.

## గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఏపీని...

# తయారు చేస్తాం..!!





**గ్రీన్ అమ్మోనియా.. భవిష్యత్తులో పెను మార్పునకు నాంది**

- గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి బాగా పెంచాలని ప్రధాని మోదీ కోరుతున్నారు
- 2014లోనే మా ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీకి నాంది పలికింది
- ఇప్పుడు గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియాకు నాంది పలికాం
- 2027 జూన్ నాటికి మొదటి దశ ఉత్పత్తి ప్రారంభమవుతుంది
- గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ మన రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ కానుంది
- బొగ్గు వినియోగం వల్ల పర్యావరణం దెబ్బతింటోంది
- కాలుష్యం వల్ల సముద్రంలోనూ పెను మార్పులు వస్తున్నాయి
- ఆంధ్రప్రదేశ్‌కు వెయ్యి కి.మీ సముద్ర తీరం ఉంది
- ప్రపంచంలో ఎండ పుష్కలంగా ఉండేది మనదేశంలోనే...: చంద్రబాబు
- బలమైన సంకల్పం ఉంటేనే ఏదైనా సాధించగలం: పవన్ కల్యాణ్

2లో

**కాకినాడ:** గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కాకినాడలో రూ.18వేల కోట్లతో ఏర్పాటు చేయనున్న ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. "గ్రీన్ అమ్మోనియా.. భవిష్యత్తులో పెను మార్పునకు నాంది. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి బాగా పెంచాలని ప్రధాని మోదీ కోరుతున్నారు. 2014లోనే మా ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీకి నాంది పలికింది. ఇప్పుడు గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియాకు నాంది పలికాం. కాకినాడలో ఏర్పాటయ్యేది ప్రపంచంలోనే అతి పెద్ద గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ. 2027 జూన్ నాటికి మొదటి దశ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ మన రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ కానుంది. బొగ్గు వినియోగం వల్ల పర్యావరణం దెబ్బతింటోంది. కాలుష్యం వల్ల సముద్రంలోనూ పెను మార్పులు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు వెయ్యి కి.మీ సముద్ర తీరం ఉంది. 20 పోర్టులు ఏర్పాటు కానున్నాయి. ప్రపంచంలో ఎండ పుష్కలంగా ఉండేది మనదేశంలోనే.


## ప్రపంచ స్వచ్ఛ ఇంధన రంగంలో

# మైలురాయి..!!

**ప్రపంచ స్వచ్ఛ ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్ మైలురాయి సాధించింది**

- ఏపీని దేశ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దాలనే స్పష్టమైన సంకల్పాన్ని వ్యక్తం చేశాం
- ఆంధ్రప్రదేశ్ నికర గ్రీన్ ఎనర్జీ ఎగుమతిదారుగా మారే దిశగా మరో కీలక అడుగు వేసింది
- గ్రీన్ అమోనియా జర్మనీతో పాటు ఇతర అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి అవుతుంది
- ఇది ప్రపంచంలోనే తొలి తరహా ప్రాజెక్ట్ : ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి:** ప్రపంచ స్వచ్ఛ ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్ మైలురాయి సాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 2024 అక్టోబర్‌లో ఆంధ్రప్రదేశ్ సమగ్ర స్వచ్ఛ ఇంధన విధానాన్ని ప్రారంభించినప్పుడు.. ఏపీని దేశ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దాలనే స్పష్టమైన సంకల్పాన్ని వ్యక్తం చేశామని గుర్తుచేశారు. ఇవాళ కాకినాడలో AM Green సంస్థ చేపడుతున్న 1.5 MTPA గ్రీన్ అమోనియా ప్రాజెక్టు ఏర్పాటు పనులు ప్రారంభించనుండటం మైలురాయిగా నిలుస్తోందన్నారు. దీని ద్వారా ఆంధ్రప్రదేశ్ నికర గ్రీన్ ఎనర్జీ ఎగుమతిదారుగా మారే దిశగా మరో కీలక అడుగు వేసిందని సీఎం తెలిపారు. 10 బిలియన్ డాలర్ల విలువైన ఈ సమగ్ర పెట్టుబడి ప్రాజెక్ట్‌లో 7.5 గిగావాట్ల సౌర, పవన విద్యుత్ సామర్థ్యం, 1 గిగావాట్ పంప్డ్ స్టోరేజ్ హైడ్రో విద్యుత్



కేంద్రం ఉన్నాయన్న ఆయన.. అన్నీ ఆంధ్రప్రదేశ్‌లోనే ఏర్పాటు కావడం తమ ఎండ్-టు-ఎండ్ స్వచ్ఛ ఇంధన ఎకో సిస్టమ్ బలాన్ని ..2వ పేజీలో

# గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఏపీని తయారు చేస్తాం..!!

**సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ .. మన రాష్ట్రానికి వరం...** మన సంస్కృతిని కాపాడుకుంటూనే టెక్నాలజీని వాడుకోవాలి. ఎంత ఎత్తుకు ఎదిగినా స్వగ్రామాన్ని మర్చిపోకూడదు. ఆలోచనలు ఆచరణలో పెట్టేవారు చాలా కొద్ది మందే ఉంటారు. వారిలో చలమలశెట్టి అనిల్ ఒకరు. చరిత్రను తిరగరాయడంలో తెలుగువాడు ముందున్నందుకు గర్వంగా ఉంది. ఆనాడు ఎన్టీఆర్ చొరవతో కాకినాడకు నాగార్జున ఫెర్టిలైజర్స్ కంపెనీ వచ్చింది. కాకినాడ గురించి భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా చర్చించుకుంటారు. ఇలాంటి పరిశ్రమలకు అనుకూలమైన పరిస్థితులన్నీ ఇక్కడ ఉన్నాయి. ప్రజలకు మేలు జరిగే ఆలోచనలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేస్తోంది. 2047 నాటికి మన రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తయారవుతుంది. గ్రీన్ అమ్మోనియా వల్ల వ్యవసాయ రంగానికి మేలు జరుగుతుంది. ప్రకృతి సేద్యం పెరగడమే అందరి ఆరోగ్యాలకు శ్రీరామ రక్ష. ఎరువులు, పురుగుమందుల వినియోగం బాగా తగ్గించాలి. గ్రీన్ అమ్మోనియాను ఏ దేశానికైనా ఎగుమతి చేసే అవకాశం ఉంది" అని సీఎం అన్నారు.

**బలమైన సంకల్పం ఉంటేనే ఏదైనా సాధించగలం : పవన్ కల్యాణ్**

బలమైన సంకల్పం ఉంటేనే ఏదైనా సాధించగలమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. తాను పుట్టి పెరిగిన కాకినాడకి అనిల్ ఎంతో చేస్తున్నారని అభినందించారు. "అనేక కష్టాలను తట్టుకుని ఏఎమ్ గ్రీన్ కంపెనీ పెట్టారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ ముందుకెళ్తున్నాం. గ్రీన్ హైడ్రోజన్ దిశగా మనం వేసే అడుగులు చాలా కీలకం. క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తు?న్నాం. కాలుష్య రహిత ఇంధన ప్రయాణంలో ఇదో మైలురాయి. రాష్ట్ర సుస్థిరాభివృద్ధిలో ఇది గేమ్ ఛేంజర్ కానుంది. ఈ ప్రాజెక్టు వల్ల వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతారు. గత ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తల ఇబ్బందులు తెలుసు. పార్టీలు మారవచ్చు.. కానీ, ప్రభుత్వ వ్యవస్థ శాశ్వతం" అని పవన్ అన్నారు.

## పట్టాలెక్కిన తొలి వందేభారత్ స్లీపర్ రైలు..

### జెండా ఊపిన ప్రధాని మోదీ

భారత్‌లో తొలి వందేభారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కింది. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో జరిగిన కార్యక్రమంలో ఈ అధునాతన రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జెండా ఊపి



ప్రారంభించారు. అంతకుముందు స్లీపర్ రైల్లో ప్రయాణించే విద్యార్థులతో మోదీ ముచ్చటించారు. రైలు లోపలికి వెళ్లి అందులోని సౌకర్యాలను ప్రధాని (గ్రావీ వీశీఎఱ) పరిశీలించారు. పశ్చిమ బెంగాల్‌లోని హౌవ్‌డా- అస్సాంలోని గువాహటి (కామాఖ్య) మధ్య ఈ రైలు రాకపోకలు సాగించనుంది. వందేభారత్ స్లీపర్ రైలు గంటకు 180 కి.మీ. గరిష్ఠ వేగాన్ని సాధించగలిగింది. రైల్వే భద్రత కమిషనర్ (సీఆర్ఎస్) సమక్షంలో కోటా (రాజస్థాన్) నుంచి నాగ్దా (మధ్యప్రదేశ్) మధ్య తుది పరీక్షలు నిర్వహించగా రైలు ఈ వేగాన్ని చేరుకుంది. గాజు గ్లాసుల్లో నీళ్లు నింపి ఒకదానిపై ఒకటిగా ఈ రైలింజిన్‌లో ఉంచినా.. రైలు గరిష్ఠ వేగాన్ని చేరుకున్నప్పుడు కూడా ఏమాత్రం నీళ్లు తొణకకపోవడాన్ని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గతంలో సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఈ రైల్లో 16 కోచ్‌లు ఉన్నాయి. వీటిలో ఆకర్షణీయమైన (ఏసీ) స్లీపర్ బెర్తులు, అధునాతన సస్పెన్షన్ వ్యవస్థ, నిప్పును గుర్తించే వ్యవస్థలు, సీసీటీవీ నిఘా వంటివి ఉంటాయి. విమానంలో ప్రయాణించిన అనుభూతిని కలిగించేలా ఇందులో సౌకర్యాలను ఏర్పాటుచేశారు. ఇందులో కనీస ఛార్జి రూ.960 నుంచి ప్రారంభమవుతుంది. ఆర్ఏసీ, వెయిటింగ్ లిస్ట్ వంటి వాటిని ఇందులో అనుమతించరు.

## హైదరాబాద్‌లో ఇల్లు కట్టాలంటే కొత్త రూల్స్..

### 10 అంతస్తులు దాటితే ఇవి ఉండాల్సిందే..

**హైదరాబాద్ నగరాభివృద్ధి దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలో ఇకపై 10 అంతస్తులు దాటి భవనాలను నిర్మిస్తే కచ్చితంగా టీడీఆర్ నిబంధనలను లోబడి ఉండాల్సిందేనని అంటున్నారు. మరి ఆ వివరాలు ఏంటి.? ఓ సారి ఈ స్టోరీలో తెలుసుకుందామా..**

హైదరాబాద్ నగరాభివృద్ధి దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రియల్ ఎస్టేట్ రంగాన్ని నేరుగా ప్రభావితం చేసేలా టీడీఆర్ విధానంలో కీలక మార్పులు



చేస్తూ పురపాలక శాఖ జీవో నెం. 16ను విడుదల చేసింది. చెరువులు, నదుల పరిరక్షణతో పాటు భూసేకరణను వేగవంతం చేయడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ సవరించిన నిబంధనలు ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరించిన తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో అమలులోకి రానున్నాయి. ఈ పరిధిలోని 300 డివిజన్లలో ఇకపై జరిగే నిర్మాణాలు కొత్త టీడీఆర్ నిబంధనలకు లోబడి ఉండాల్సి ఉంటుంది. నగరంలో హైరిస్ భవనాల నిర్మాణాన్ని నియంత్రించేలా ప్రభుత్వం కీలక షరతును విధించింది. ఇకపై 10 అంతస్తులు దాటే ప్రతి భవనానికి టీడీఆర్ తప్పనిసరి కానుంది. 11వ అంతస్తు నుంచి పై అంతస్తుల వరకు నిర్మించే మొత్తం విస్తీర్ణంలో 10 శాతానికి సమానమైన టీడీఆర్ సర్టిఫికెట్లు బిల్డర్లు సమర్పించాల్సి ఉంటుంది. దీంతో ఇప్పటివరకు మార్కెట్‌లో వినియోగం లేక నిల్వగా ఉన్న టీడీఆర్ బాండ్లకు డిమాండ్ పెరగనుంది. భూమిని ప్రభుత్వానికి ఉచితంగా అప్పగించే బిల్డర్లకు ప్రత్యేక రాయితీలు కూడా ఈ జీవోలో పొందుపరిచారు. సెట్‌బ్యాక్ నిబంధనల్లో, భవన ఎత్తు పరిమితుల్లో సడలింపులు కల్పిస్తూ వారిని ప్రోత్సహించనున్నారు. దీని ద్వారా భూసేకరణ ప్రక్రియ సులభతరం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. చెరువులు, నదుల పరిరక్షణకు సంబంధించి భూముల స్వాధీనంపై కూడా ప్రభుత్వం ఆకర్షణీయమైన విధానాన్ని ప్రకటించింది. ఎఫ్‌టీఎల్ పూర్తిస్థాయి నీటి మట్టం పరిధిలో ఉన్న పట్టా భూములకు 200 శాతం టీడీఆర్, చెరువుల బఫర్ జోన్లలో ఉన్న భూములకు 300 శాతం టీడీఆర్, బఫర్ వెలుపల అభివృద్ధి పనుల కోసం భూములు సేకరిస్తే 400 శాతం టీడీఆర్ ఇవ్వాలని నిర్ణయించింది. ఒక ఎకరాకు మించి భూసేకరణ జరిగితే ఆ ప్రతిపాదనను ప్రభుత్వం నేరుగా పరిశీలించనుంది. మూసీ నది పరీవాహక ప్రాంతం, నగరంలోని చెరువుల సుందరీకరణ పనులకు భూ యజమానుల నుంచి ఎదురవుతున్న అడ్డంకులను తొలగించడమే ఈ విధాన మార్పుల లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది.

## కేజీ చికెన్ ఏకంగా రూ.2 వేలు..

## కొనేందుకు జనం బారులు..

**సంక్రాంతి సందర్భంగా ఏపీలో ఇంకా పలుచోట్ల కోడి పందేలు జరుగుతూనే ఉన్నాయి. ఇక పలు జిల్లాల్లో పండుగ శోభ సంతరించుకునే ఉంది. అయితే పందెంలో ఓడిపోయిన కోళ్లకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. ఇవి భారీ ధరకు విక్రయిస్తున్నారు. ఒక్కో కోడి ఎంత పలుకుతుందో తెలుసా..?**




సంక్రాంతి పండుగ అంటేనే ఆంధ్రా.. ఆంధ్రా అంటేనే సంక్రాంతి పండుగ అనేది అందరికీ తెలిసిందే. ఏపీలో సంక్రాంతి పండగ అంతలా పాపులర్ అయింది. అత్యంత గ్రాండ్‌గా ఏపీలో సంక్రాంతి సంబురాలు ఊరువాడా జరుగు తూ ఉంటాయి. ఎక్కడెక్కడో నివసించేవారు ఈ పండక్కి తప్పనిసరిగా తమ సొంతూళ్లకి చేరుకుంటారు. ఇక పిల్లలు పంతుగులు ఎగురువేయడం, మహిళలు రకరకరాల రంగవల్లులతో అలంకరణలు, కొత్త అల్లుళ్లతో సందడి అటు ఉంచితే.. సంక్రాంతి అంటే అందరికీ గుర్తొచ్చేది కోడి పందేలే.. ప్రత్యేక బరులు ఏర్పాటు చేసి ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో కోడి పందేలు నిర్వహించడం సాంప్రదాయంగా వస్తోంది. ఎప్పటిలాగే ఈ సారి కూడా ఏపీలో పండక్కి కోడి పందేలు జోరుగా సాగాయి. రూ.కోట్లల్లో చేతులు మారాయి.

**ధర ఎంతంటే..?...** అయితే పందెంలో ఓడిపోయిన కోడిని ఏం చేస్తారనే అనుమానం చాలామందికి ఉంటుంది. పందెంలో ఓడిపోయిన కోడి పుంజును గెలిచిన విజేతకు దక్కుతుంది. దీంతో గెలిచినవారు ఓడిపోయిన కోడిపుంజును విక్రయించడం లేదా బంధువులు, స్నేహితులకు పంచడం లాంటివి చేస్తూ ఉంటారు. పందెం కోళ్లకు బాదం, పిస్తా లాంటివి వేసి పెంచుతారు. దీంతో వాటి మాంసం మరింత రుచికరంగా ఉంటుంది. దీని వల్ల ఓడిపోయిన కోడి మాంసానికి ఫుల్ డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం పందెంలో ఓడిపోయిన కోళ్లు రూ.6 వేల నుంచి రూ.8 వరకు పలుకుతున్నాయి. ఇక వీటి కేజీ చికెన్ రూ.2 వేల వరకు ఉంటుంది. ధర ఎక్కువగా ఉన్నా రుచి కోసం వీటిని కొనుగోలు చేసేందుకు ఎక్కువమంది ఆసక్తి చూపిస్తున్నారు.

**కొత్త అల్లుళ్ల కోసం..** ఓడిపోయిన కోళ్లను బరుల వద్దే విక్రయిస్తున్నారు. దీంతో ఆసక్తి ఉన్నవారు కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్తున్నారు. పందెం కోళ్లకు బాదం, పిస్తాతో పాటు చికెన్, గుడ్లు, మటన్ కీమా వంటి అధిక ప్రోటీన్ కలిగిన ఆహారం అందించి పెంచుతారు. దీని వల్ల వీటి మాంసం కూడా అత్యంత రుచికరంగా ఉంటుంది. దీంతో వీటిని కొనుగోలు చేసేందుకు పోటీ పడున్నారు. ఇక సంక్రాంతికి ఇంటికొచ్చే కొత్త అల్లుళ్లకు కూడా ఇలాంటి మాంసాన్ని వడ్డిస్తారు.

## ప్రపంచ స్వచ్ఛ ఇంధన రంగంలో మైలురాయి..!!

**(మొదటిపేజి తరువాయి)** స్పష్టంగా చూపిస్తోందన్నారు. కాకినాడలో ఉత్పత్తి అయ్యే గ్రీన్



అమోనియా జర్మనీతో పాటు ఇతర అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి అవుతుందని తెలిపారు. ఇది ప్రపంచంలోనే తొలి తరహా ప్రాజెక్ట్ అని సీఎం అన్నారు. ఈ చారిత్రక ప్రాజెక్ట్‌కు సంబంధించిన పరికరాల ఏర్పాటు కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, తాను పాల్గొంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

# మున్సిపల్ ఎన్నికల...

# రిజర్వేషన్లు ఖరారు..

### మహిళలు, బీసీలకు కేటాయించిన స్థానాలివే..

**తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన రిజర్వేషన్ల ఖరారుతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం కావడం, ఇప్పుడు మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్ల రిజర్వేషన్లు కూడా ఖరారు కావడంతో అభ్యర్థుల వేట మొదలైంది. అగ్రస్థానాల్లో మహిళా ప్రాతినిధ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది.**




తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి అత్యంత కీలకమైన అంకం పూర్తయింది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో రిజర్వేషన్లను ప్రభుత్వం అధికారికంగా ఖరారు చేసింది. మొత్తం 10 కార్పొరేషన్లలో 5 మహిళలకు కేటాయించడం ద్వారా మహిళా ప్రాతినిధ్యానికి పెద్దపీట వేశారు. ప్రధాన నగరాల్లో మేయర్ పదవుల రిజర్వేషన్లు ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా రాజధాని హైదరాబాద్ జనరల్ మహిళకు కేటాయించడం గమనార్హం.

కార్పొరేషన్ రిజర్వేషన్ కేటగిరీ జీహెచ్ఎంసీ -- జనరల్ మహిళ వరంగల్ -- జనరల్ నల్గొండ, ఖమ్మం, నిజామాబాద్ -- జనరల్ (మహిళ) మహబూబ్‌నగర్ -- బీసీ మహిళ మంచిర్యాల, కరీంనగర్ -- బీసీ రామగుండం -- ఎస్సీ కొత్తగూడెం -- ఎస్టీ

మున్సిపాలిటీల్లో బీసీల జోరు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీ రిజర్వేషనర్లలో బీసీలకు పెకద్దపీట వేశారు. మొత్తం బీసీలకు 38 మున్సిపాలిటీలు కేటాయించారు. ఇందులో బీసీ మహిళలకు 19 కేటాయించింది. బీసీ మహిళలకు రిజర్వ్ అయిన కొన్ని ప్రధాన మున్సిపాలిటీలలో.. ఇల్లందు, జగిత్యాల, కామారెడ్డి, బాన్సువాడ, మెదక్, ములుగు, దేవరకొండ, గజ్వేల్, దుబ్బాక, పరిగి, నర్సంపేట, కాగజ్ నగర్, దేవరకద్ర, చెన్నూరు, కొల్లాపూర్, అచ్చంపేట, ఆలేరు, ఆత్మకూరు, కొత్తకోట ఉన్నాయి. జనగాం, భూపాలపల్లి, నాగర్ కర్నూలు, తాండూరు, హుజూర్ నగర్, సిద్దిపేట సహా మరికొన్ని మున్సిపాలిటీలు బీసీ జనరల్ ఉన్నాయి.

**రాజకీయ సమీకరణాలు మార్చనున్న రిజర్వేషన్లు...** ఈ రిజర్వేషన్ల ప్రకటనతో ఆయా నియోజకవర్గాల్లోని రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోనున్నాయి. 50 శాతం రిజర్వేషన్ల అమలుతో మున్సిపల్ పీఠాలపై మహిళల ఆధిపత్యం పెరగనుంది. రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చిన చోట అభ్యర్థులు ఇప్పటికే ప్రచారానికి సిద్ధమవుతుండగా, అనుకూలించని చోట తమ అనుచరులను లేదా కుటుంబ సభ్యులను రంగంలోకి దించేందుకు నేతలు ప్లాన్ చేస్తున్నారు.

**బీసీ ఓటు బ్యాంక్...** బీసీలకు గణనీయమైన సంఖ్యలో మున్సిపాలిటీలు కేటాయించడం ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపనుంది. ఓటర్ల జాబితా కూడా సిద్ధం కావడంతో ఒకటి, రెండు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. దీంతో తెలంగాణ పురవీధులన్నీ ఎన్నికల ప్రచారంతో హోరెత్తనున్నాయి.

# చదువే పెదోడి ఆస్తి..

### అక్షర ఆయుధంతోనే సమస్యలు పరిష్కారం..

**ఆస్తిగా ఇవ్వడానికి భూములు లేవు.. అందుకే నా పేద బిడ్డలకు అక్షర ఆయుధాన్ని అందిస్తున్నాను అని సీఎం రేవంత్ రెడ్డి ఎమోషనల్ అయ్యారు. విద్య ద్వారానే సామాజిక గౌరవం సాధ్యమని అన్నారు .రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, సివిల్స్ అభ్యర్థులకు ఆర్థిక సాయం వంటి విప్లవాత్మక మార్పులతో విద్యా రంగాన్ని పరుగులు పెట్టిస్తామని హామీ ఇచ్చారు.**

విద్య ఒక్కటే మన సమస్యలన్నింటికీ పరిష్కారం చూపుతుందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పేదరికం నుంచి బయటపడాలన్నా, సమాజంలో గౌరవం పొందాలన్నా



చదువే ఏకైక మార్గం అని స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఐఐఐటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. బూర్గుల రామకృష్ణారావు తర్వాత మహబూబ్‌నగర్ జిల్లాకు 75 ఏళ్లకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం వచ్చిందని సీఎం గుర్తు చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లాను విద్యా, ఇరిగేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. అందులో భాగంగానే ఏడాది కాలంలోనే ఐఐఐటీ భవనాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు.

**మారుమూల పల్లె నుంచి ముఖ్యమంత్రి పీఠం వరకు..** తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తు చేసుకుంటూ విద్యార్థుల్లో సీఎం రేవంత్ రెడ్డి స్ఫూర్తి నింపారు. అచ్చంపేట నియోజకవర్గంలోని ఒక మారుమూల పల్లె నుంచి వచ్చిన తాను, కేవలం 17 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలోనే ముఖ్యమంత్రి అయినట్లు తెలిపారు. కనీసం మంత్రి కూడా కాకపోయినా, పట్టుదల.. కష్టపడే తత్వం.. ప్రజల సహకారంతో ఈ స్థాయికి చేరుకున్నట్లు ఆయన వివరించారు. జీవితంలో పైకి రావాలంటే క్రమశిక్షణ, పట్టుదల చాలా ముఖ్యమని హితవు పలికారు.

**విద్యకే మా మొదటి ప్రాధాన్యత...** ప్రస్తుత పరిస్థితుల్లో భూమి లేని నిరుపేదలకు, దళితులకు పంచడానికి భూములు కూడా లేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేసిన సీఎం, ఇప్పుడు చదువు ఒక్కటే మనకున్న అతిపెద్ద ఆస్తి అని పేర్కొన్నారు. రూ.200 కోట్లతో అత్యాధునిక వసతులతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. సివిల్ సర్వీసెస్‌కు సిద్ధమయ్యే వారికి ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే విద్యార్థులు తమ భాషా నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సీఎం సూచించారు.

**నిబద్ధత లేని చదువు వేస్ట్..** "చదువు కేవలం మార్కుల కోసం కాదు.. నిబద్ధత లేని చదువు జీవితానికి ఉపయోగపడదు. సంస్కారం, తల్లిదండ్రుల పట్ల గౌరవం ఉన్నప్పుడే ఆ చదువుకు సార్థకత లభిస్తుంది" అని రేవంత్ అన్నారు. ప్రతి విద్యార్థి తన తల్లిదండ్రులను గౌరవించాలని, వారి కష్టాన్ని స్మరించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. మహబూబ్ నగర్ జిల్లాను విద్యా సంస్థల నిలయంగా మారుస్తామని, ప్రజలకు మేలు చేయాలన్న ఏకైక ఆలోచనతోనే రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

# ఆ పెన్సిల్ గీతలు ఎంత తప్పో నేటితరానికి తెలియాలి

**(మొదటిపేజి తరువాయి)** నేను చాలాసార్లు అనుకున్నా. భారత సంప్రదాయాలు, భాషల గురించి ఏమీ తెలియని ఓ వ్యక్తి పెన్సిల్ (నాటి వైస్రాయ్‌ను ఉద్దేశించి) తీసుకుని గీత గీసి.. ఇవి మీ సరిహద్దులని చెప్పారు. ఆ విభజన కారణంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్‌కు వలస వెళ్లినవారి గురించి ఆలోచిస్తే చాలా బాధగా ఉంటుంది. ఓసారి నేను పాకిస్థాన్‌కు వెళ్లినప్పుడు అక్కడి మ్యూజియంకు వెళ్తే విదేశీయురాలినని ఎక్కువ ఛార్జ్ చేశారు. ఒకప్పుడు అది మన అఖండ భారతంలోని భాగమే కదా.. ఇప్పుడు సరిహద్దుల కారణంగా విదేశమైందన్న ఆలోచన నన్ను చాలా బాధ పెట్టింది" అని సుధామూర్తి గుర్తుచేసుకున్నారు. "ఈ భూమి, మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ ఊరికే



రాలేదన్న విషయాన్ని ఇప్పటి పిల్లలకు చెప్పాలనుకుంటున్నా. మన పూర్వీకులు ఎంతో కష్టపడి వాటిని సాధించారు. ఎంతోమంది ఇళ్లను కోల్పోయినా.. సంకల్ప బలంతో వారి జీవితాలను పునర్ నిర్మించుకున్నారు. దేశ విభజన కోసం ఆనాడు తీసుకున్న ఓ తప్పుడు నిర్ణయం ఎన్నోతరాలపై ప్రభావం చూపిస్తోంది" అని సుధామూర్తి వివరించారు. ఈ విషయాలన్నీ యువతరానికి తెలియజేసేందుకు 'ది మ్యాజిక్ ఆఫ్ ది లాస్ట్ ఇయర్‌రింగ్స్' పుస్తకాన్ని రాసినట్లు తెలిపారు. తన మనవరాలు అనౌష్కశర్మను ఆధారంగా చేసుకునే ఈ పుస్తకంలోని ప్రధాన పాత్రను తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు.

# ఎన్టీఆర్ కు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఘన నివాళి.

**- ఎన్టీఆర్ లాంటి వ్యక్తి యుగానికొక్కడే పుడతాడు - ఎంపీ పుట్టా మహేష్ కుమార్.**



-ఏలూరు, జనవరి 18: మహానటుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, స్వర్గీయ నందమూరి తారక రామారావు 30 వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసిన ఎంపీ, తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక "ఎన్టీఆరు అన్నారు. ఎన్టీఆర్ అంటేనే ఒక సంచలనం అని, సినిమాల్లో రాముడు అన్నా, కృష్ణుడు అన్నా ఆయనేనని, ప్రపంచ చలనచిత్ర చరిత్రలోనే ఏ నటుడు చేయనన్ని గొప్ప గొప్ప పాత్రలను పోషించిన మహానటుడు శ్రీ ఎన్టీ రామారావు అన్నారు. రాజకీయాల్లోకి వచ్చి తెలుగుదేశం పార్టీ పెట్టి కేవలం 9 నెలల్లో ఘనవిజయం సాధించి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి చరిత్ర సృష్టించిన వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. తెలుగువాడిగా పుట్టి, దేశ రాజకీయాలనే మలుపుతిప్పిన గొప్ప నేత ఎన్టీఆర్ అన్నారు. ఈరోజు బీసీ కులాలకు చెందిన తన వంటి ఎంతోమంది రాజకీయాల్లోకి రాగలిగామంటే ఆనాడు అన్న ఎన్టీఆర్ తీసుకొచ్చిన సంస్కరణలే కారణం అనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా, పేదల సంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబునాయుడు గారి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎన్టీఆర్ ఆశీస్సులతో, ప్రజల దీవెనలతో రాష్ట్రంలో మరో 20-30 ఏళ్ళు తెలుగుదేశం కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ లాంటి మహా మనీషి యుగానికి ఒక్కడే పుడతాడన్న ఎంపీ, త్వరలోనే రాజధాని అమరావతిలో ఎన్టీఆర్ భారీ విగ్రహం, స్మృతివనం ప్రాజెక్టు కార్యరూపం దాల్చబోతోందన్నారు.

- ఇట్లు
- ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ గారి కార్యాలయం, ఏలూరు.
- ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులందరూ కవర్ చేయవలసిందిగా కోరుచున్నాము.

# దేవేంద్రుడు ప్రతిష్ఠించిన అమరేశ్వరునికి ప్రత్యేక పూజలు

గాయత్రి వార్తలు




పంచారామ క్షేత్రమైన శ్రీ బాల చాముండిక సమేత శ్రీఅమరేశ్వర స్వామి దేవాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. శని ఆదివారాలు సెలవు దినాలు కావడంతో శ్రీ అమరేశ్వరాలయంలో శివనామ స్వరముతో మారుమోగింది. తెల్లవారుజామున నాలుగు గంటలకు శ్రీఅమరేశ్వర స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యూ లైన్ ఎలాంటి ఇబ్బందులు కలక్కుండా ఆలయ సహాయ కమిషనర్ రేఖ చూశారు. నది తీరాన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూశారు రెండు రోజులు సెలవు కావడంతో భక్తులు నది స్థానం అనంతరం కుటుంబ సమేతంగా కార్తీకదీపంలు వెలిగించి భక్తులు చాటుకున్నారుకాబట్టి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

# ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలి







**- ఘనంగా ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, పద్మశ్రీ శ్రీ నందమూరి తారక రామారావు 30 వ వర్ధంతి**

గుంటూరులో చిల్లీస్ డాబా సెంటర్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూల తోటి ఘన నివాళులర్పించిన అఖిల భారత పంచాయతీ పరిషత్( ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు మరియు అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులుశ్రీ నందమూరి తారక రామారావు గారి అసాధారణ జీవితం మరియు వారసత్వానికి గుర్తింపుగా, ఆయన దార్శనిక నాయకత్వం, కళా ప్రతిభ మరియు తెలుగు ప్రజల పట్ల అచంచలమైన అంకితభావం ఆంధ్రప్రదేశ్ పై చెరగని ముద్ర వేశారని అఖిల భారత పంచాయతీ పరిషత్( ఢ. ి ల్లీ ) జాతీయ ఉపాధ్యక్షులు మరియు అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు తెలిపారు ఈ మేరకు ఆదివారం ఉదయం అమరావతి రోడ్డులోని చిల్లీస్ డాబా వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూల తోటి పూలమాలలతో ఘన నివాళులర్పించారు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ

తెలుగు జాతికి గర్వకారణమైన ఎన్.టి. రామారావు, తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవలు సినిమా రంగానికి చేసిన సేవలు అజరామమన్నారు రాముడు ఎలా ఉంటాడో కృష్ణుడు ఎలా ఉంటాడో ప్రజలకు తన నటన ద్వారా చాటిచెప్పిన ధీరుడు అన్నారు ప్రజల హృదయాలలో ఎప్పటికీ చెరగని ముద్ర వేశారన్నారు గౌరవ ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం తక్షణం భారతరత్న ఇచ్చి ఎన్టీఆర్ ను గౌరవించాలన్నారు

# నకరికల్లు పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్.పి.

**సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి- పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు.**

గాయత్రి వార్తలు



మండల కేంద్రమైన పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదుదారుని సమస్యలను తెలుసుకుని పరిష్కరించేలా చొరవ చూపాలని పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. ఆకస్మిక తనిఖీలో భాగంగా నకరికల్లు స్థానిక పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు . ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామాలలో అల్లర్లు జరగకుండా నివారించడానికి ప్రతీ గ్రామానికి ఒక్కొక్క పోలీసును కేటాయించామని తెలిపారు.రౌడీ షీటర్లు పద్ధతులు మార్చుకొని నడుచుకోవాలని,లేని యెడల వారిపై కఠినమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.అద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ తనిఖీలలో సత్తెనపల్లి రూరల్ సీఐ పీ.కిరణ్, ఎస్సై కే.సతీష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఒక్కటిగా సిద్ధం అవుదాం - మళ్ళీ అధికారం సాధిద్దాం

గాయత్రి వార్తలు



కమిటీలు త్వరగా సిద్ధం చెయ్యాలని పెదకూరపాడు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు క్యాడర్కు ఆదేశించారు.

2029 లో మళ్ళీ మన వై యస్ ఆర్ సీపీ ప్రభుత్వం అధికారం లోకి రావడానికి మనం అందరం ఒక్కటిగా సిద్ధం అవ్వాలని పెదకూరపాడు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. పల్నాడు జిల్లా వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ, మండల సంస్థా గత కమిటీలు త్వరితగతిన ఏర్పాటు చేయాలనీ కోరారు. ఎన్నో పథకాలు, అభివృద్ధి చేసినప్పటికి పార్టీ కార్యకర్తలలో ఉత్తేజం లేకపోవడం వలన విజయాన్ని సాధించలేకపోయామన్నారు. కార్యకర్తల బలోపేతానికి ఈ కమిటీ లు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. పార్టీ కష్టకాలంలో పని చెసే ప్రతీ కార్యకర్తకు రానున్న కాలంలో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉమ్మడి గుంటూరు జిల్లా పార్టీ టాస్క్ ఫోర్స్ అధ్యక్షులు సుధాకర్ బాబు , నర్సరావుపేట పార్లమెంటరీ పరిశీలకులు పూనూరు గౌతమ్ రెడ్డి , మాజీ మంత్రి విడుదల రజని , సత్తెనపల్లి నియోజకవర్గం సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి , పెదకూరపాడు నియోజకవర్గం పరిశీలకులు యెనుమల మురళీధర్ రెడ్డి మరియు నియోజకవర్గం లోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ అంటే వ్యక్తి కాదు సమూహ శక్తి

గాయత్రి వార్తలు



కచేరి సెంటర్లో ఎన్టీఆర్ 30 వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల టిడిపి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. టిడిపి సీనియర్ నాయకులు ఆర్తి మల్ల రమేష్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ అంటే ఒక వ్యక్తి కాదు సమూహ శక్తి అని అన్నారు. ఆయన అడుగుజాడల్లోనే ప్రజా సేవ చేస్తూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ముందుకు సాగుతున్నారని అన్నారు. ఎంతోమందికి రాజకీయ జీవితం కల్పించిన మహానేత ఎన్టీఆర్ అని తెలిపారు. అనంతరం అభిమానులకు పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బ్రహ్మయ్య, భాష్యం ఆంజనేయులు, రాంగోపాల్రావు, గంగినేని లీలావతి, వడ్లమూడి అప్పారావు,ముంతాజ్, గల్లా బాబురావు, అజుముల్లా, గల్లా శివ, కూటమి నేతలు పాల్గొన్నారు.

# రోడ్డుకు మరమ్మత్తులు.

గాయత్రి వార్తలు



అమరావతి: సత్తనపల్లి రోడ్డు, గుంటూరు రోడ్ లో శనివారం సాయంకాలం రోడ్డు మరమ్మత్తులు చేపట్టారు. గుంతల మయంగా ఉన్న రోడ్ల ను తవ్వి మట్టిని తొలగించారు. ఆ స్థానంలో టెస్టు గ్రావెల్ వేసి చదును చేశారు. రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా చేపట్టి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరారు.

# ఎస్సై గా బాధ్యతలు చేపట్టిన నస్రిన్

గాయత్రి వార్తలు



టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ ( ఎస్ ఐ) గా షేక్ నస్రీన్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. క్రైమ్ రేటు తగ్గించేందుకు కృషి చేస్తా అన్నారు. పట్టణ ప్రజలు లా అండ్ ఆర్డర్ కు సహకరించాలని కోరారు.

# కాళికా అమ్మవారి మొక్కుబడి ఆహ్వాన కార్యక్రమం లో పాల్గొన్న డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



గాయత్రి వార్తలు

నియోజకవర్గం నరసరావుపేట మండలం ములకలూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఆవుల అర్జునరావు కాళికా అమ్మవారి మొక్కుబడి ఆహ్వాన కార్యక్రమం లో పాల్గొన్న పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నరసరావుపేట మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఈ కార్యక్రమం లో గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెంట వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జీజీహెచ్ ను తనిఖీ చేసిన కలెక్టర్

గాయత్రి వార్తలు



ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా శనివారం తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న మాతృ, శిశు ఆరోగ్య కేంద్రం, ఇతర వార్డులలో పర్యటించారు. మాతృ, శిశు ఆరోగ్య కేంద్రం పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అప్రోచ్ రహదారి పనులు, ఇంకా మిగిలి ఉన్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# ఘనంగా యుగపురుషుని 30వ వర్ధంతి

గాయత్రి వార్తలు



సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లని నినదించిన మహోన్నత వ్యక్తి విశ్వవిఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ నందమూరి తారక రామారావు యుగపురుషుని 30వ వర్ధంతి సందర్భంగా ఎన్జీవో కాలనీలోని లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరాం



## స్పిరిట్ విడుదల ఖరారు

కథానాయకుడు ప్రభాస్.. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కలయికలో రూపొందుతున్న బహుభాషా చిత్రం 'స్పిరిట్'. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్, టీ సిరీస్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. త్రిప్తి దిమ్రీ కథానాయిక. వివేక్ ఒబెరాయ్, కాంచన, ప్రకాశ్‌రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాని వచ్చే ఏడాది మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ విషయాన్ని దర్శకుడు సందీప్ శుక్రవారం సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించారు. శక్తిమంతమైన పోలీసు కథతో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో ప్రభాస్ ఐపీఎస్ అధికారిగా రా రస్టిక్ లుక్‌లో అలరించనున్నారు. ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. దీనికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

# బిలియన్ క్లబ్‌లో మిల్కీ బ్యూటీ..


## యూట్యూబ్‌లో ట్రెండ్ సెట్టర్‌గా తమన్నా! ఎందుకంటే?

బాలీవుడ్ మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా వరుస ఆఫర్స్ తో ఫుల్ జోష్ లో ఉంది. వచ్చిన ప్రతి ఆఫర్ ను సద్వినియోగం చేసుకుంటూ దూసుకెళ్తోంది. అది గ్లామర్ పాత్రలైనా, నటనకు ప్రాధాన్యమున్న పాత్రలైనా, లేదా ఊపేసే స్పెషల్ సాంగ్స్ అయినా.. ఇట్టే ఆకట్టుకుంటుంది. లేటెస్ట్ గా తమన్నా ఖాతాలో ఒక రికార్డు వచ్చి చేరింది. ఆమె నటించిన 'ఆజ్ కీ రాత్ష సాంగ్ యూట్యూబ్‌లో 1 బిలియన్ (100 కోట్లు) వ్యూస్ సాధించి సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.

గతేడాది బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేసిన బాలీవుడ్ హారర్ కామెడీ 'స్త్రీ 2'లో తమన్నా 'ఆజ్ కీ రాత్ష అనే స్పెషల్ సాంగ్‌లో మెరిసింది. ఈ పాటలోని ఆమె డ్యాన్స్ మూమెంట్స్, ఎక్స్‌ప్రెషన్స్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ పాట 100 కోట్ల వ్యూస్ మైలురాయిని దాటడంతో తమన్నా ఎమోషనల్ అయ్యారు. "మొదటి వ్యూ నుంచి వన్ బిలియన్ వరకు.. మీరు చూపిస్తున్న ఈ అంతులేని ప్రేమకు థాంక్సు అంటూ సోషల్ మీడియా వేదికగా అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

### శ్రీ నుంచి ఓదెల వరకు

2005లో 'చాంద్ సా రోషన్ చెహ్రా' అనే హిందీ చిత్రంతో కెరీర్ మొదలుపెట్టిన తమన్నా, అదే ఏడాది 'శ్రీ' సినిమాతో తెలుగు తెరకు పరిచయమయ్యారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన 'హ్యాపీ డేస్ష ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. ఆ తర్వాత 100% లవ్, బద్రీనాథ్, రచ్చ, ఊపిరి, ఎఫ్ 2 వంటి చిత్రాలతో టాప్ హీరోయిన్‌గా గుర్తింపును సొంతం చేసుకుంది. 'బాహుబలి' చిత్రంలో అవంతికగా తమన్నా చేసిన సాహసోపేతమైన నటన ఆమెను గ్లోబల్ స్టార్‌ను చేసింది. ఇటీవల 'ఓదెల 2'లో శివశక్తి పాత్రలో భిన్నమైన గెటప్‌తో ఆకట్టుకున్న ఆమె, ప్రస్తుతం హిందీలో మూడు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.



### ఐటమ్ సాంగ్స్‌తో ట్రెండ్ సెట్టర్

హీరోయిన్‌గా రాణిస్తూనే, స్పెషల్ సాంగ్స్‌లో నటించడానికి తమన్నా ఎప్పుడూ వెనుకాడలేదు. ఆమె చేసిన ప్రతి పాట ఒక ట్రెండ్ సెట్టర్ నిలిచింది. వాటిల్లో ప్రధానంగా 'అల్లుడు శ్రీను ' మూవీలోని 'రావే నా లబ్బర్ బొమ్మ' ఐటమ్ సాంగ్స్‌తో ఆమె తొలి అడుగు వేసింది. 'జై లవకుశ' లో ఎన్టీఆర్‌తో కలిసి చేసిన 'స్వింగ్ జరా' డ్యాన్స్ నంబర్ అప్పట్లో పెద్ద హిట్ గా నిలిచింది. రజనీకాంత్ జైలర్ సినిమాలోని 'నువ్వు కావాలయ్యా' సాంగ్ కు స్టెప్పులతో గ్లోబల్ వైడ్ వైరల్ అయ్యింది. ఆతర్వాత రైడ్ 2'లో 'నషా' పాటతోనూ మరోసారి తన గ్లామర్ పవర్ చూపించారు

కేవలం అందం మాత్రమే కాదు, కఠినమైన డ్యాన్స్ మూమెంట్స్‌ను కూడా ఎంతో ఈజ్‌తో చేయగలగడం తమన్నా ప్రత్యేకత. అందుకే ఆమెను అభిమానులు 'డ్యాన్సింగ్ క్వీన్ష అని పిలుచుకుంటారు. వెండితెరపై ఆమె ఇచ్చే ఆ 'నషా' ఇలాగే మరిన్ని బిలియన్ వ్యూస్ సాధించిపెట్టింది.



## డీసీపీ రీటా వచ్చేది ఆరోజే!

బాలీవుడ్ కథానాయిక భూమి పెడ్నేకర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సిరీస్ 'దల్దాల్'. సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో అమృత్ రాజ్ గుప్తా దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సిరీస్ టీజర్‌ను పంచుకుంటూ.. విడుదల తేదీని ప్రకటించింది ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో. "నువ్వు దానితో ఎంత ఎక్కువగా పోరాడితే.. అది అంత లోతులోకి తీసుకెళ్తుంది" అనే వ్యాఖ్యను జోడించింది. ముంబయి నేపథ్యంలో సాగే ఈ సిరీస్‌లో కొత్తగా నియమితులైన డీసీపీ రీటా ఫెరీరా పాత్రలో కనిపించనుంది భూమి. ఆమె ఓ క్రూరమైన నేరస్థుడి ఆటను ఎలా రక్తికట్టించిందనే దాని చుట్టూ ఈ సిరీస్ కథ తిరుగుతుంది. విక్రమ్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ సిరీస్ ఈ నెల 30న రాబోతుంది.

# బెంగళూరులో మహేష్ బాబు ఫ్యాన్స్ హంగామా..

## AMB సినిమాస్ ఓపెనింగ్‌లో ఉద్రిక్తత.. పోలీసుల లాఠీఛార్జ్!



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు క్రేజ్అంతా ఇంతాకాదు. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, పొరుగున ఉన్న కర్ణాటకలోనూ ఆయనకు ఏ స్థాయి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందో తాజాగా బెంగళూరులో జరిగిన ఒక సంఘటన నిరూపించింది. బెంగళూరులోని గాంధీ నగర్‌లో కొత్తగా నిర్మించిన ఌవీదీ సినిమాస్ ప్రారంభోత్సవానికి మహేష్ బాబు హాజరైయ్యారు. ఈ సందర్భంగా తమ అభిమాన హీరోను చూసేందుకు వేల సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. ఒక్కసారిగా మహేష్ బాబును చుట్టుముట్టారు.

ఒకప్పుడు బెంగళూరులో ఐకానిక్ థియేటర్‌గా వెలుగొందిన 'కపాలి' థియేటర్ ఉన్న స్థలంలోనే అత్యాధునిక ఏఎమ్‌బీ మల్టీప్లెక్స్‌ను హీరో మహేష్ బాబు నిర్మించారు. శుక్రవారం (జనవరి 16) ఈ మల్టీప్లెక్స్ ప్రారంభోత్సవానికి మహేష్ బాబు వస్తున్నారన్న సమాచారంతో వేల సంఖ్యలో అభిమానులు గాంధీనగర్‌కు చేరుకున్నారు. మహేష్ బాబు కారు దిగగానే ఒక్కసారిగా అభిమానులు ఆయనను చూడటానికి ఎగబడ్డారు. దీంతో అక్కడ తీవ్రమైన తోపులాట జరిగింది. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో పోలీసులు స్వల్పంగా లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చింది. చివరకు సెక్యూరిటీ సిబ్బంది ఎంతో శ్రమించి మహేష్ బాబును సురక్షితంగా లోపలికి తీసుకెళ్లారు.

### దక్షిణాదిలోనే తొలి 'డాల్బీ సినిమా'

హైదరాబాద్‌లో ఇప్పటికే సంచలనం సృష్టించిన Aవీదీ సినిమాస్, ఇప్పుడు బెంగళూరులో సరికొత్త రికార్డు సృష్టించింది. ఇది దక్షిణాదిలోనే మొట్టమొదటి Dolby Cinema అనుభవాన్ని అందించే థియేటర్. 4ఖ లేజర్ ప్రొజెక్షన్, లగ్జరీ ఆడిటోరియమ్స్, అద్భుతమైన డాల్బీ అట్మోస్ సౌండ్ సిస్టమ్‌తో సినీ ప్రేమికులకు ప్రపంచ స్థాయి అనుభూతిని పంచనుంది. ఈ టెక్నాలజీని తీసుకురావడానికి కష్టపడ్డ ఌవీదీ టీమ్‌ను మహేష్ బాబు ప్రత్యేకంగా అభినందించారు.

### 'వారణాసి' లేటెస్ట్ అప్‌డేట్స్

ఇక మహేష్ బాబు సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం ఆయన దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో ప్రపంచస్థాయి అడ్వెంచర్ మూవీ "వారణాసి" లో నటిస్తున్నారు. ఈ మైథాలజీ అండ్ ఫారెస్ట్ అడ్వెంచర్‌లో మహేష్ బాబు 'రుద్ర' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా ఇందులో 'మందాకిని'గా మహేష్ బాబు సరసన నటిస్తుంది. ఇక మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ'గా నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో మెప్పించనున్నారు. ప్రకాష్ రాజ్ కీలక పాత్ర పోషిస్తున్నారు . కె.ఎల్. నారాయణ , ఎస్.ఎస్. కార్తికేయ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమా 2027 వేసవిలో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



## ఈ ఆటలో అందరూ దోషులే

"అది పంటైనా, కలుపైనా.. పాపమైనా, పుణ్యమైనా.. ఒక మనిషి తను నాటింది అతనే కోసుకోవాల"ని అంటున్నారు తమిళ హీరో ధనుష్. ఆయన ప్రధాన పాత్రలో 'డీ54' (వర్కింగ్ టైటిల్) అనే చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. విఘ్నేశ్ రాజా దర్శకత్వం వహిస్తున్నారు. మమితా బైజు కథానాయిక. తాజాగా ఈ సినిమాకు 'కర' అనే పేరును ఖరారు చేసినట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. "ఈ ఆటలో ప్రతి ఒక్కరూ దోషులే.. కాకపోతే కారణే వేర్వేరు" అనే వ్యాఖ్యను జోడించింది. 'నా పేరు కరసామి. అందరూ నన్ను కర అని పిలుస్తారు' అంటూ ధనుష్ పాత్రను పరిచయం చేసిన తీరు ఆకట్టుకుంటోంది. గ్రామీణ నేపథ్యంలో తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో జయరామ్, సూరజ్ వెంజరమూడు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ నిర్మిస్తుంది.

## మాట తప్పం.. సరిహద్దు దాటనివ్వం



"ఒక సైనికుడికి.. సరిహద్దు అంటే కేవలం పటంపై గీసిన గీత కాదు.. ఇది తన దేశ ప్రజలకు ఇచ్చిన మాట. అతను నిలబడి ఉన్న ఆ గీతను శత్రువును దాటినివ్వనని చేసిన ప్రమాణం" అంటూ యుద్ధ రంగంలోకి అడుగుపెట్టారు బాలీవుడ్ హీరో సన్నీ దేఒల్. ఇదంతా ఆయన నటించిన 'బార్డర్ 2' సినిమా కోసమే. అనురాగ్ సింగ్ దర్శకత్వం వహించారు. వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్, అహాన్ శెట్టి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 23న థియేటర్లలోకి రాబోతుందీ చిత్రం. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ట్రెలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. సరిహద్దుల్లో మన సైనికులు చేసే సాహసాలు, వాళ్ల కోసం ఎదురుచూసే కుటుంబ సభ్యుల భావోద్వేగాలను చూపిస్తూ ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతోందీ ట్రైలర్. "ఈరోజు ఎట్టిపరిస్థితుల్లోనూ మనం ఇచ్చిన మాటను తప్పకూడదు', 'భారతీయుల్నే భయపెడుతున్నారా?" లాంటి శక్తిమంతమైన సంభాషణలు సినీప్రియుల్ని ఆకట్టుకుంటున్నాయి. భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్, జేపీ దత్తా సంయుక్తంగా నిర్మించారు.

## జపాన్‌లో పుష్ప 2 సందడి



'పుష్ప కున్రిన్' పేరుతో జపాన్‌లో 'పుష్ప 2: ది రూల్' సందడి మొదలైంది. అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ తెరకెక్కించిన ఈ సినిమాని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి గీక్ పిక్చర్స్, షోచికు సంస్థలు జపాన్ ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లాయి. రష్మిక కథానాయిక. ఇది శుక్రవారం అక్కడ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా అల్లు అర్జున్ అక్కడి ప్రేక్షకులతో కలిసి చేస్తున్న సందడి నెట్టింట వైరల్‌గా మారింది. ముఖ్యంగా ఈ సినిమాలో జపాన్ పోర్టు ఫైట్ నేపథ్యంలో బన్నీ చెప్పిన జపనీస్ డైలాగ్‌ను ఆయన అక్కడి ప్రేక్షకుల ముందు లైవ్‌లో చెప్పడం అందరి దృష్టినీ ఆకర్షించింది. మరి ఈ సినిమా జపాన్‌లో వసూళ్ల పరంగా ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో తెలియాలంటే ఇంకొన్నాళ్లు వేచి చూడక తప్పదు.

***GAYATHRI VARTHALU Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,*** SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/25/A1201 .. Cell No - 7386045673 ..... Printed At SUNDAY PRINTING PRESS, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.